ప్రజాశక్తి

శనివారం 15 ఏప్రిల్ 2023 — 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

శాశ్వత రాజకీయ లబ్ధి కోసమే..

మైనారిటీలపై బిజెపి దాడులు

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య
- వామపక్షాల ప్రచార భేరి ప్రారంభం



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


దేశంలో శాశ్వత రాజకీయ లబ్ధి కోసమే బిజెపి మైనార్టీలపై దాడులు చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. స్థానిక కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఎం, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శులు జి.రమేష్, పివిఆర్ చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాల కాలంలో దేశంలోని సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగానికి విలువ ఇవ్వకుండా కూకటివేళ్లతో పీకివేయాలనే ఆలోచనలో ఉన్న పాలకులు నేడు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ఆర్ఎస్ఎస్ ▶ 2లో



రంజిత్‌బాషా

బాపట్ల కలెక్టర్‌గా రంజిత్‌బాషా బాధ్యతల స్వీకరణ

▶ 8లో



అంబేద్కర్ స్ఫూర్తితో

జిల్లా అభివృద్ధికి చర్యలు


ఒంగోలులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

మైనారిటీలపై బిజెపి దాడులు

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాలలో భాగంగా రాజ్యాంగంలోని సామ్యవాదం అనే పదాన్ని తొలగించేందుకు బిజెపి కుట్ర పన్నుతుందన్నారు. దేశంలో లౌకికత్వాన్ని కాపాడుకోవడంలో కమ్యూనిస్టులది కీలక పాత్ర అని తెలిపారు. బిజెపి మతోన్మాదాన్ని మరింత రెచ్చగొట్టేలా ప్రయత్నాలు చేస్తోందని, సర్జికల్ స్ట్రైక్ సినిమా అందులో భాగమేనన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పిన మోడీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోడీ హామీలు ఇప్పుడు గుర్తుకు రావటం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తానన్న జగన్ అందుకు విరుద్ధంగా మోడీకి సాష్టాంగ ప్రమాణం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. త్రిపుల్ తలాక్, వ్యవసాయ మూడు చట్టాలకు జగన్ పార్లమెంటులో బిజెపికి పూర్తి మద్దతు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరానికి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నా.. జగన్ నోరెత్తి మాట్లాడటం లేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి నష్టం కలిగించేలా కర్ణాటకలోని ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హెూదా కల్పించడమే కాకుండా, రూ.5300 కోట్లు నిధులు ఇవ్వటం దుర్మార్గమన్నారు. ఇంటింటికి స్టిక్కర్లు వేస్తున్న సిఎం జగన్ పాలనను ఎందుకు నమ్మాలో చెప్పాలన్నారు. కమ్యూనిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై దాడులు చేస్తున్నందుకు నమ్మాలా? అని ప్రశ్నించారు. 'బిజెపి హటావో.. దేశ్ కి బచావో..' పేరుతో సాగుతున్న ప్రచార జాతాను విజయవంతం చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతికి సిపిఐ, సిపిఎంల ప్రచార భేరి కార్యక్రమానికి సారూప్యత ఉందన్నారు. రాజ్యాంగం అమలులో వచ్చిన నాటి నుండి దేశంలోని ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే అందుకు కారణం అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే అని తెలిపారు. రాజ్యాంగ పీఠికలో భిన్నత్వంలో ఏకత్వం అనే సూక్తితో దేశం శోభిల్లుతుంటే, బిజెపి మాత్రం ఏకత్వంలో భిన్నత్వం పేరుతో దేశంలోని ప్రజలను కులతత్వం, మతతత్వంతో మరింత సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, లేకపోతే రాజ్యాంగం నిలబడదన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకే ఈ ప్రచార భేరి కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సిపిఐ, సిపిఎంల ఉద్యమాలకు మద్దతుగా నిలిచి జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి పాలనకు చరమగీతం పాడాలన్నారు. ప్రతి ఒక్కరూ సిపిఐ, సిపిఎం ప్రచార భేరి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ సిపిఐ, సిపిఎం ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ఒంగోలు లోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జివి కొండారెడ్డి, దామా శ్రీనివాసరావు, కంకణాల రమాదేవి, సిపిఐ నాయకులు ఉప్పుటూరు ప్రకాశరావు, ఎస్ డి సర్దార్, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వేటకు విరామం

ప్రజాశక్తి -శింగరాయకొండ

సముద్రంలో శనివారం నుంచి వేట నిషేధం అమలులోకి రానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజులు పాటు సముద్రంలో వేట నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు పదివేల రూపాయలు చొప్పున అందించనున్నారు. చేపలు గుడ్లు సమయంలో భాగంగా 61 రోజులు పాటు సముద్రంలోకి ఎవరూ వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించనున్నారు. గత 15 రోజులుగా మత్స్యకారులకు వేట సాగలేదు. బలంగా వీస్తున్న గాలుల కారణంగా మత్స్యకారులు వేల సాగించలేదు. తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు బోట్లు హద్దులు దాటి వేట సాగిస్తున్నాయి. వేట నిషేధం నేపథ్యంలో కడలూరు బోట్లకు ఎలా చెక్ పెట్టాలనే ఆలోచనలో మత్స్యకార గ్రామాల పెద్దలు ఉన్నాయి. వేట నిషేధం పూర్తయిన తర్వాత కడలూరు బోట్లకు స్వస్తి చెప్పేందుకు మత్స్యకారులంతా ఉండి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.


ఒడ్డుకు చేర్చిన బోట్లు

గ్రామసభల ద్వారా సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి -శింగరాయకొండ

గ్రామసభల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని మూలగుంటపాడు సర్పంచి డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, శింగరాయకొండ సర్పంచి తాడిపర్తి వనజ తెలిపారు. శింగరాయకొండ మూలగుంటపాడు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని అన్ని శాఖల అధికారులతో సమస్యల గురించి చర్చించారు. శింగరాయకొండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో వార్డు సభ్యులు పొదర్తి కోటేశ్వరరావు, ఓలేటి రవి శంకర్ రెడ్డి, పడిదపు రవికుమార్ బోర్లు,తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కాలువలు రోడ్ల తవ్వకాలపై అధికారులను నిలదీశారు. వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించడం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, సైదులు , షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి తాటిపర్తి వనజ

మజ్జిగ పంపిణీ

కనిగిరి : స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ డివిఎస్.నారాయణరావు తెలియజేశారు. వేసవి నేపథ్యంలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సుధీర్‌బాబు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశాల సందర్శన

టంగుటూరు : స్థానిక పిహెచ్ సి, హెల్త్ వెల్ నెస్ కేంద్రాలలో 105 రకాల మందులు,14 రకాల ల్యాబ్ పరీక్షలు రోగులకు అందుబాటులో ఉంటాయని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. టంగుటూరు పిహెచ్‌సిని డిఎం అండ్ హెచ్ఒ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని సౌకర్యాలు, మందులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ 5వ వార్షికోత్సవం సందర్భంగా పిహెచ్‌సి సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ మాధవీ లత, డిపిఎంఒ డాక్టర్ టి వాణిశ్రీ, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ బాలాజీ అశోక్, సిహెచ్ఒ వెంకటేశులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా షడ్రక్, అనిల్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఎంపిపి నలమలపు అంజమ్మ కష్టారెడ్డి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కండ్లగుంట సర్పంచి అంజిరెడ్డి, కంచర్ల సుధాకర్ , పోలినేని కోటయ్య,పేరాల చెన్నకేశవులు, బాలకృష్ణ, బోలే ఆంజనేయులు,మద్దిసాని నాగేశ్వరావు, గుండు హరిబాబు, ప్రమోద్ ,జాన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మార్కాపురం

అరుణాచల ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వ్యవస్థాపకులు డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 110 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మార్కాపురం రక్తనిధి కేంద్రంలో రక్తం నిల్వ లేని సమయయంలో ఇలాంటి శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ లక్ష్మిరెడ్డిని పలువురు అభినందించారు. తొలుత శిబిరాన్ని ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంగు సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.పిచ్చిరెడ్డి, డాక్టర్ చాగంటి సాయికిరణ్‌రెడ్డి, పాల్గొన్నారు.

మాజీ సర్పంచి దేశంగారావు మృతి

మద్దిపాడు : మద్దిపాడు మాజీ సర్పంచి బత్తిన దేశంగారావు శుక్రవారం మృతి చెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషయమించడంతో మృతి చెందాడు. దేశంగారావు మృతదేహాన్ని మాజీ సర్పంచులు యు. నాగేశ్వరావు జి.నరసింహారావు, గ్రామ పెద్దలు కాకు మాను సుబ్బారావు, కె. రంగారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు.


దేశంగారావు(ఫైల్)

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్ : మండల పరిధిలోని అంబవరం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ,పోలేరమ్మ తల్లి దేవస్థానం 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

అంబేద్కర్ జయంతి సందర్భంగా శ్రీ వివేకానంద కళాశాలలో 1983 -88 విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థుల చలివేంద్రాన్ని ప్రారంభిచారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయుడు సోడా రామచంద్ర రెడ్డి , పూర్వ విద్యార్థుల పి.హనుమంత్ రెడ్డి , తులసి బాబు సుబ్బరాయుడు ,గజ శ్రీనివాసులు ,మోహన్‌రావు, బాబావలి, రంగ స్వామి , రవి స్వరూప్ ,ప్రసాదు, ఉపాధ్యాయుడు ఖాదర్ వలి, సింగర్ వెంకటేశ్వర్లు, దుర్గ రంగస్వామి రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య

కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను కడతేర్చిన భార్య, అత్త

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెంలో దారుణం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను కర్కశంగా కడతేర్చింది భార్య. ఈ దారుణం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ రైల్వేస్టేషన్‌కు పడమరవైపు ఉన్న అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకొంది. స్థానికులు, మృతుడి బంధువులు అందించిన వివరాల ప్రకారం.. సలగల అజయ్‌బాబు ఉరఫ్ నాని (42) స్వస్థలం చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామం. అదే గ్రామానికి చెందిన మహిళను పెళ్లి చేసుకొని ఇరవై సంవత్సరాల నుంచి వేటపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం ఉదయం అజయ్‌బాబు ఇంటి ముందు రక్తం మడుగులో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వేటపాలెం ఎస్ఐ జి సురేష్ తన స్పిందితో ఘటనా స్థలానికి చేరుకొని చీరాల రూరల్ సిఐ ఎ మల్లిఖార్జునరావుకు సమాచారం అందించారు. సిఐ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతుడు సోదరుడు విజయ్‌బాబు ఫిర్యాదు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. పరిసరాల పరిశీలించి భార్య, అత్తలను ప్రశ్నించారు. మద్యం సేవించి ఇంటి పైనుంచి బండ మీద పడడంతో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేశారు. పోలీసులు బాపట్ల నుంచి క్లూస్ టీంను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. డాగ్ మృతుడి ఇంటి నుంచి సంతరావూరు వెళ్లే దారిలో ఉన్న పులక్కాలువ వద్దకు చేరుకొంది. కాలువలో హత్యకు ఉపయోగించిన రాడ్, రాయి, దుప్పటిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. దుప్పటిలో రాయి ఉండడం వలన నీటి ప్రవాహానికి కొట్టుకుపోకుండా వేసిన చోటే ఉన్నాయి. పోలీసులు అనుమానితులును గుర్తించి అదుపులోకి తీసుకొన్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు అజయ్‌బాబు ఇంకొల్లు స్పిన్నింగ్‌లో పని చేస్తుంటాడు. భార్య స్థానికంగా ఉన్న బీడి హాస్పటల్‌లో ఎంఎఫ్ఒగా పని చేస్తుంది. భార్యభర్తలకు తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని ప్రజలు అనుకొంటున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బయట పడిన మహిళ మృతదేహం

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని పెద్దవెంకన్నపాలెం గ్రామానికి చెందిన పిల్లిపోగు కొండమ్మ(37) మతిస్థిమితం లేక 2022 డిసెంబర్ నెలలో పెద్దవెంకన్నపాలెం చెరువులో పడి మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు గతంలో చనిపోయారు. కొండమ్మ కనిపించడం లేదని పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో 2022 డిసెంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఆ చెరువులో నీరు తగ్గడంతో మృతదేహం బయటపడింది. ఈ విషయాన్ని గమనించిన కొందరు స్థానికులు పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజారావు వారి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం పిల్లిపోగు కొండమ్మదిగా గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బ్రాందీ షాపు కాపలాదారుడు హత్య

ప్రజాశక్తి-కొండపి

ప్రభుత్వ బ్రాందీ షాపులో కాపులాదారుడుగా ఉంటున్న వ్యక్తిపై గడ్డపారతో పొడిచి చంపిన సంఘటన శుక్రవారం కొండపిలో కలవర పెట్టింది. మండలంలోని పోలిరెడ్డిపాలేనికి చెందిన సంగం సుబ్బారెడ్డి అనే అతను గత మూడున్నర ఏళ్ల నుంచి కొండేపిలోని మద్దులూరు రోడ్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణంలో రాత్రి పూట కాపలాగా ఉంటూ వస్తున్నాడు. పగటిపూట వ్యవసాయ పనులు చేసుకుంటూ రాత్రిపూట మద్యం దుకాణం వద్ద కాపులదారుడుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శుక్రవారం తెల్లవారినప్పటికీ అక్కడ నిద్రలేవకపోవడంతో చుట్టుపక్కల వారు వచ్చి లేపేందుకు ప్రయత్నించి రక్తపు మడుగుల్లో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగి వివరాలు సేకరించారు. పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఒంగోలు నుంచి జాగిలాలను రప్పించి ఆ ప్రాంతమంతా తిప్పారు. ఘటన స్థలాన్ని దర్శి డిఎస్పి నారాయణ స్వామిరెడ్డి, కొండపి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వైవి రమణయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ అధ్యక్షతన శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినుకొండ సుగంధర్, వైసిపి నాయకులు, యర్రగొండపాలెం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దూదేకుల కాశయ్య, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, జిల్లా సేవాదళ్ కార్యదర్శి దుగ్గెం దినేష్, వేశపోగు కరుణకర్, వేశపోగు సల్మాన్‌రాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరికలు

ప్రజాశక్తి-బాపట్ల: తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో బాపట్ల మండలం, ఈతేరు గ్రామం, దాసు నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీ నాయకులు నరేంద్రవర్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో వైసిపి నాయకులు బత్తుల మధు, కట్ట సురేష్ ఆధ్వర్యంలో 15 కుటుంబాల వైసిపి కార్యకర్తలను బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ పార్టీ కండువాలు కప్పి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో రోజురోజుకు తెలుగుదేశం పార్టీ బలపడుతుంద న్నారు. బాపట్ల నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగరేస్తుంది అన్నారు. టిడిపిలో చేరిన వారిలో జంగం సురేష్, దమ్ము నాగరాజు, బేతాళ సుబ్బారావు, కట్ట సునీల్, బేతాళం అంకినీడు, తలతోటి నాగరాజు, గొల్ల వినోద్, తలతోటి అనిల్, కాలింత సుదర్శన్, కసుపర్తి సత్యానందం, బేతాళం హైమారావు, కూచిపూడి సంసోను ఉన్నారు. కార్యక్రమంలో బాపట్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముక్కమల సాంబశివరావు, బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోలపల శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

మార్కాపురం జిల్లా సాధిస్తాం: టిడిపి

ప్రజాశక్తి-మార్కాపురం

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, మార్కాపురం ప్రత్యేక జిల్లా చేయాలని కోరుతూ టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాదయాత్ర శుక్రవారంతో ముగిసింది. ముగింపు సభ మార్కాపురం పట్టణంలోని నాయుడు బజారులో రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సభలో వైసిపి నుంచి సస్పెండైన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొని మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టును వైసిపి గాలికి వదిలేసిందన్నారు. 2024లో టిడిపి అధికారంలోకి వస్తుందని, వెలిగొండ ప్రారంభిస్తామని చెప్పారు. మార్కాపురం జిల్లా అవసరమని, తాము జిల్లాను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పశ్చిమ ప్రాంత ప్రజల కోసం పాదయాత్ర చేపట్టిన కందుల నారాయణరెడ్డి ఆ పార్టీ నాయకులు అభినందించారు.

యువకుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-జరుగుమల్లి

జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామంలో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనలో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేయగా మరొక నిందితుడి కోసం గాలిస్తున్నారు. స్థానికులు, పోలీసుల నుంచి అందిన వివరాల ప్రకారం.. మండలంలోని కె బిట్రగుంట గ్రామానికి చెందిన పెరుగు నాగేశ్వరరావు పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కుంచాల ఉమా మహేశ్వరరావుతో డబ్బు విషయంలో చాలా కాలంగా విభేదాలున్నాయి. గ్రామంలో నాగేశ్వరరావు స్థలం పక్కనే ఉమా మహేశ్వరరావుకు కూడా స్థలం ఉంది. ఇద్దరి మధ్య హద్దుల విషయంలో మరోసారి వివాదం చోటు చేసుకుంది. పాత గొడవలను మనసులో పెట్టుకున్న ఉమా మహేశ్వరరావు ఇదే అదనుగా నాగేశ్వరరావుకు చెందిన స్థలాన్ని కొట్టేయాలని, అందుకు అతడిని హత్య చేయాలని పన్నాగం పన్నాడు. ఇందుకు సింగరాయకొండ, బిట్రగుంట గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు పవన్, జోయల్, వెంకటేశ్వరరావులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. నాగేశ్వరరావును హత్య చేసేందుకు రూ.లక్షకు బేరం మాట్లాడుకున్నాడు. గత 20 రోజుల నుంచి వారి ఖర్చులను భరిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో నాగేశ్వరరావు గ్రామ శివారున 16వ జాతీయ రహదారిపై ఉన్న పెట్రోలు బంకు సమీపంలోని షెడ్డుకు ఆవులను తోలుకెళుతుండగా కాపుకాచి ఉన్న నిందితులు దాడి చేశారు. ఇద్దరు నిందితులు నాగేశ్వరరావు కాళ్లు గట్టిగా పట్టుకోగా మరో నిందితుడు నైలాన్ తాడుతో గొంతుకు ఉరి బిగించే ప్రయత్నం చేశాడు. దీంతో బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు కొందరు ఘటనా స్థలికి చేరుకున్నారు. దీంతో నిందితులు నాగేశ్వరరావును వదలి పారిపోయారు. ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు పట్టుకోగా మరొక నిందితుడి కోసం గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి పట్టణం బాప్టిస్ట్ పాలెం సమీపంలోని ఒంగోలు కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కాటూరివారిపాలెం గ్రామానికి చెంందిన చల్లా వెంకటేశ్వర్లు(64) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన కథనం మేరకు.. పొదిలి నుంచి ఒంగోలు వెళ్లే రోడ్డులో నాగూర్ మీరాసాహెబ్ దర్గాకు కొంచెం దూరంలో కాటూరివారిపాలెం గ్రామం నుంచి పొదిలికి వెళ్తున్న ట్రాక్టర్ కాటూరివారిపాలెం గ్రామం వైపు వెళుతున్న మోటార్ బైక్‌ను ఢీకొట్టడంతో మోటార్ బైకుపై ప్రయాణిస్తున్న చల్లా వెంకటేశ్వర్లు అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు. చల్ల శ్రీనివాసులు ఇచ్చిన రిపోర్ట్ మేరకు పొదిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం రిక్షాను ఢీకొన్న ఘటన ఒంగోలు నుంచి గుంటూరు రహదారిలో బొమ్మిడాల పొగాకు గ్రేడింగ్ హాలుకు సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ బి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిపాడు నుంచి రిక్షాలో తల్లీకొడుకు వెల్లంపల్లి వెళుతున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రిక్షా బోల్తా పడింది. రిక్షాలో ఉన్న తల్లి నారాయణమ్మకు తీవ్ర గాయాలు కాగా కొడుకు వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 1033 అంబులెన్సులో ఒంగోలు రిమ్స్ తీసుకుపోయారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణమ్మ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నాగమల్లి



ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల జిల్లా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులుగా అద్దంకి మండలం గోవాడ గ్రామానికి చెందిన గెల్లా నాగమల్లి నియమితుల య్యారు. ఈ మేరకు జిల్లా మానిటరింగ్ కమిటీ నుంచి నియామక పత్రం అందినట్లు నాగమల్లి శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లా మానిటరింగ్ కమిటీలో సభ్యులుగా నియామకానికి సహకరించిన జిల్లా కలెక్టరు, మంత్రి మెరుగు నాగార్జున, వైసిపి అద్దంకి ఇంచార్జి బాచిన కృష్ణచైతన్య కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులపై సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని నాగమల్లి తెలిపారు.

ఒంగోలులో వరుస దొంగతనాలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రై: నగరంలోని రాజీవ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగలు దొంగతనానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. విలువైన వస్తువులు జాగ్రత్తపరచుకోవడంతో అవి చోరీకి గురికాలేదు. తాలూకా సిఐ ఆర్ రాంబాబు దొంగతనం జరిగి న ఇళ్లను పరిశీలించారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. హెల్ప్ ఆఫీస్ దగ్గరలో నివాసముంటున్న జివి ఎస్ శాస్త్రి, అతని భార్య నెల రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న వారి కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దుండగులు ఇంటి ముందు తలుపు గడియ తొలగించి ఇంటిలోకి ప్రవేశించి దేవుని గదిలో ఉండే అర కిలో వెండి వస్తువులను చోరీ చేసినట్లు తెలిపారు. అలాగే అదే ప్రాంతంలో నివాసముంటే రిటైర్డ్ టీచర్ దేవరపల్లి రామకృష్ణారెడ్డి, అతని భార్య అమెరికాలో ఉంటున్న వారి కుమార్తె వద్దకు జనవరి 27వ తేదీన వెళ్లారు. వారి ఇంటిలో కూడా ముందు తలుపు గడియ తొలగించి ఇంటిలోకి ప్రవేశించి వెతికినప్పటికీ వారికి విలువైన వస్తువులు చోరీకి గురికాలేదని తెలిపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చోరీ జరిగిన ఇళ్లను ట్రైనీ ఐపిఎస్ అంకిత సురాన, ఎఎస్‌పి క్రైం శ్రీధర్‌రావు పరిశీలించారు.

గ్రేస్ ఫౌండేషన్ సేవలు భేష్

ప్రజాశక్తి-భట్టిప్రోలు: గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమూరు నియోజకవర్గంలో చేపడుతున్న అనేక ప్రజా సేవా కార్యక్రమాలు ఆదర్శవంతమైనవని రేపల్లె మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని పెసర్లంక డికె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ శివజ్యోతి ● పలుచోట్ల ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ శివజ్యోతి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా బాపట్ల కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావని అన్నారు. దేశంలో పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి రాజ్యాంగాన్ని రచించారన్నారు. అంబేద్కర్ జీవిత స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఎదగాలని కోరారు. పలువురు దళిత సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిడి రాజ్ దిబోరా, బాపట్ల రెవెన్యూ అధికారి రవీంద్ర, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, మత్స్య శాఖ జెడి సురేష్, దళిత సంఘాల నాయకులు జి చారువాక, ఇ మాల్యాద్రి, వందనం, శ్రీరాములు, దళిత సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో..

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా పోలీస్ అధికారులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి ఎండిహెచ్ ప్రేమ్ కుమార్, అడ్మిన్ ఆర్ఐఎల్ మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్ ఇతర పోలీస్ అధికారులు, డిపిఓ సిబ్బంది పాల్గొని బిఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.

బాపట్ల: ఆధునిక భారతదేశ నిర్మాత భారత రాజ్యాంగ రూపశిల్పి బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను పలు ప్రజా సంఘాల రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి బాపట్ల వైసీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోన రఘుపతి ఆయన ఇంటి వద్ద నుంచి వైసిపి నాయకులు, సంఘాల నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి కోన నివాళులర్పించారు. రైల్వే స్టేషన్ వద్ద పూలమాలలతో అలంకరించిన అంబేద్కర్ విగ్రహానికి పుష్పగుచ్ఛాలతో అంజలి ఘటించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి కోన ప్రసంగించారు.

బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్లోని భారీ అంబేద్కర్ విగ్రహానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రేన్‌పై నుంచి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అదేవిధంగా రైల్వే స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కాగిత కోటేశ్వరావు, గండికోట నాగరాజు, మెండాల ఝాన్సీ, గడ్డం ఏలియా పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు నామన వెంకట శివన్నారాయణ, జనసేన వికలాంగుల సంఘం నాయకులు గోగన ఆదిశేషు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొల్లూరు: భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ అన్నారు. గురువారం కొల్లూరు గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణ, రాజశేఖర్, మరియు కార్యకర్తలు, కొల్లూరు గ్రామ ఎస్సీ నాయకులు, యువత పాల్గొన్నారు.

అద్దంకి: అద్దంకి మండలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకల ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఆ సంఘ నాయకులు నిర్వహించారు. ఈ



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డిఆర్ఓ లక్ష్మీ శివజ్యోతి

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, వైసిపి సీనియర్ నాయకులు బాచిన చెంచు గరటయ్యలు హాజరై ఒకే వేదికను పంచుకున్నారు. పార్టీలు వేరైనా ఆ మహనీయుని జయంతి వేడుకలలో ఇరువురు పక్కపక్కనే కూర్చోవడం విశేషమనే చెప్పవచ్చు.

భట్టిప్రోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు, అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, తహశీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పెదపులివర్రు, అక్కివరిపాలెం, కోళ్లపాలెం, పల్లెకోన, వెల్లటూరు తదితర గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జి సుధాకర్, నాగ మల్లేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

అమృతలూరు: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం అమృతలూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్ భూమి పూజ చేశారు. తొలుత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ షేక్ మహబూబ్ సుభాని, విస్తరణాధికారి మరియ కుమారి, గృహ నిర్మాణ శాఖ ఏ గాంధీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శుక్రవారం పంగులూరు మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పంగులూరు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు ప్రసంగిస్తూ అంబేద్కర్ సేవలను కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తేళ్ల నాగమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాయిని ప్రమీల, సర్పంచి నాగేంద్రమ్మ, వైసిపి నాయకులు గుడిపూడి రామారావు, రాయిని వెంకట సుబ్బారావు, నల్లమల అజిల్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. రామకూరు గ్రామంలో గ్రామ ఉపసర్పంచి పెదవలి అశోక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జాగర్లమూడి వారి పాలెంలో జయంతి వేడుకలు జరిగాయి. రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్తపూడి ఏసోబు, ఎస్ఐ కేకే తిరుపతి రావు, ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ తెలగతోటి రాధాకృష్ణల ను ఘనంగా సన్మానించారు. పంగులూరు దళిత కాలనీ, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు, రేణింగవరం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపల్లె: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా సీపీఎం కార్యాలయంలో, అంబేద్కర్ భవన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం, ప్రజా సంఘాలు నేతలు నివాళులర్పించారు. అనంతరం సిపిఎం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా బలహీన వర్గాల కోసం అంబేద్కర్ చేసిన సేవలు గొప్పవని అన్నారు. సిపిఎం, కెవిపిఎస్, సీఐటీయూ ప్రజ సంఘాలు నాయకులు కె రమేష్, కె ఆశీర్వాదం, బి నాగరాజు, ఎం సూర్య ప్రకాష్, చిట్టిబాబు, కే వెంకటేశ్వరరావు, డి వంశీకృష్ణ, డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ 132వ జయంతిని మార్టూరులోని విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయ ఆవరణలో జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రభుదాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బత్తుల హనుమంతరావు, అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అంబేద్కర్ అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు షేక్ కమాలుద్దీన్, చిట్టిబాబు, రైతు సంఘం నాయకులు సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు పి బ్రహ్మయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ తన సిబ్బందితో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బహుజన సమాజ్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త సిహెచ్ నగేష్‌బాబు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు.

భట్టిప్రోలు(కొల్లూరు): కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామంలో రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు బి సుబ్బారావు, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ పి సునీత, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పర్చూరు: సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ చేసిన సేవలను మాజీ ఏఎంసి చైర్మన్ నరిశెట్టి ఆచార్యులు కొనియాడారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి ఆధ్వర్యంలో బొమ్మల సెంటర్‌లో విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. రాజ్యసభ సభ్యులు మోపిదేపి వెంకటరమణ, బాపట్ల జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు, రీజనల్ కోఆర్డినేటర్ భూమా కరుణాకర్‌రెడ్డి,



అద్దంకిలో అంబేద్కర్ జయంతి సభలో వేదికపై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య

పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్, బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని నూతలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య ఆధ్వర్యంలో జరిగాయి. ఎల్‌వి నాగేశ్వరరావు, బండి శంకరయ్య, చినదాసు, వెంకయ్య, ఆర్ ఏసోబు, ఏసుబాబు, టైటస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపిడివో కార్యాలయం వద్ద అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంపీడీవో, సిహెచ్ కృష్ణ పంచాయతీరాజ్ హనుమంతరావు, సర్పంచులు ధూళిపాళ్ల బుల్లిరామయ్య, పసల అంజలి నాగేశ్వరరావు, బండారు వెంకాయమ్మ గురవయ్య, జూపల్లి రాఘవరావు, మెడ జయలక్ష్మి మండల కో ఆప్షన్ సభ్యులు శ్రీనువలి, ఎంవి ఫౌండేషన్ మండల బాధ్యులు హరిహరరెడ్డి, కోటేశ్వరరావు ఆయా గ్రామల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబు, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి నిజాంపట్నం పంచాయతీ ఎక్స్ మిలిటరీ కాలనీ, థామస్ పేట గ్రామాలలో వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వర్లు, సంఘ పెద్దలు, అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీపీ విజయనిర్మల హరినాథ్ బాబు సహకారంతో ఏర్పాటు చేయబోయే అంబేద్కర్ 15 అడుగుల విగ్రహానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం ఉప సర్పంచ్ మోపిదేవి మార్కండేయులు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మాజీ బోర్డు యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, కట్టుపల్లి శ్రీను, మాజీ ఎంపీటీసీ పేర్ల మోహన్‌రావు, మోపిదేవి శివ నాగరాజు, కన్న నాగేంద్రబాబు, సీతా నాగబాబు, శీలం సాంబయ్య, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి అసోసియేట్ డీన్ రాధా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలు కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం సామాజిక న్యాయం అందేలా చేసిందన్నారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, విమలా బీర, సోమేశ్వరరావు, సౌజన్య పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

చీరాల: సామాజిక విప్లవకారుడు, ప్రపంచ మేధావి, రాజ్యాన్ని నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడు అని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు లింగం జయరాజు అన్నారు. శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ముక్కోణపు పార్క్ సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు నాయకులు ఎన్ బాబురావు, వృత్తి సంఘం నాయకులు పి కొండయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్ర రామారావు, బి పిచ్చయ్య, యుటిఎఫ్ నాయకులు రాజవర్ధన్, ఏసేబు, ఐవి సుబ్బారావు, వై ప్రసాద్, కె వెంకటేశ్వర్లు, బి సుబ్బారావు, కే వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు ఎం సత్యమూర్తి నివాళులు అర్పించారు.



మార్టూరులో..



పంగులూరులో..



భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో..

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలి

ప్రచార భేరిలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కనిగిరి

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ కార్యదర్శి పిసి. కేశవరావు కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రచారభేరి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ తీరును గురించి వివరించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం తీరును రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షపార్టీలు వ్యతిరేకించకుండా సానుకూలంగా మద్దతు తెలపటం దుర్మార్గమన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసులు, ఎస్‌కె.బషీరా, ప్రసన్న, నరేంద్ర, రవి, యు.పిచ్చయ్య, ఆదిలక్ష్మి, ఎస్‌కె.ఖాదర్‌వలి, వరలక్ష్మి పాల్గొన్నారు. **టంగుటూరు :** రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని సిపిఎం మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, నాయకులు టంగుటూరి రాము తెలిపారు. స్థానిక పురం సెంటర్ నుంచి బస్ స్టాప్ సెంటర్ వరకూ ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ మతోన్మాద, కార్పోరేట్ అనుకూల, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టంగుటూరి వెంకట్రావు, టి.నారాయణరావు, టంగుటూరి పాపారావు, కొల్లాబత్తిన శ్రీను, మల్లాల యానాది, ఎస్‌కె శ్రీను, సిపిఐ నాయకులు టి.ప్రభాకర్ పాల్గొన్నారు. **పొదిలి :** ప్రజాస్వామ్యం, లౌకికత్వానికి తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. రమేష్ తెలిపారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న



కనిగిరిలో మాట్లాడుతున్న పిసి కేశవరావు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తూ ఒకే దేశం, ఒకే బాష, ఒకే విద్య, ఒకే పన్ను విధానాన్ని బలవంతంగా రుద్దు తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రకృతి వనరులను అదానీ,అంబానీ లాంటి కార్పోరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతూ పేద మధ్యతరగతి ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల రేట్లు పెంచి భారాలు మోపుతుందని విమర్శించారు. సిపిఐ మండల కార్యదర్శి కెవి.రత్నం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మైనార్టీలు హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శేషయ్య, ఆర్.రాంబాబు, ఎ.వెంకట్రావు, డి.నరసయ్య, శ్రీను, అంబేద్కర్ ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు. **పామూరు :** మోడీ ప్రభుత్వాని గద్దె దించేందుకు అందరూ ముందుకు రావాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి కోరారు. మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ గౌస్ బాషా, మహాదేవయ్య, భానుమతి, షేక్ ఖాదరున్నీషా, శీను, సిహెచ్ వెంకటేశ్వర్లు, సుభాని పాల్గొన్నారు. **మార్కాపురం :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరిని ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ కార్యదర్శులు డి. సోమయ్య, అందె నాసరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అంబేద్కర్ భారీ విగ్రహాలను స్థాపిస్తూ ఆయన పట్ల కపట ప్రేమను చూపిస్తూ... మరోపక్క ఆయన రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మోడీ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కులు కాల రాస్తున్నారని, ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు డికెఎం. రఫీ, సిపిఐ నాయకులు షేక్ ఖాశిం, చిత్తారి పెద్దన్న, డి. కాశయ్య, సిపిఎం నాయకులు పి. రూబెన్, జవ్వాజి రాజు, కె.కాశయ్య, జి.విక్టర్, జోనా, చెన్నకేశవులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. **దర్శి :** మోడీని గద్దె దించి దేశాన్ని కాపాడాలని సిపిఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, నాయకుడు సందు వెంకటేశ్వర్లరావు, సిపిఐ నాయకులు మాదపాకుల రమేష్, జూపల్లి కోటేశ్వరరావు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కరుణానిధి, వెంకయ్య, అరుణ, కోటేశ్వరరావు, పుల్లయ్య, అంజిబాబు, నారాయణ, మహేష్ పాల్గొన్నారు. **త్రిపురాంతకం :** మోడీని గద్దె దించడమే కమ్యూనిస్ట్ పార్టీ లక్ష్యమని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ మండల కార్యదర్శి బానల రామయ్య ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురునాధం, విశ్వరూపచారి, నాగయ, తిరుమలయ్య, మల్లికార్జున, నాగేశ్వరావు, ఆదినారాయణ పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం మండల కార్యదర్శి టి. శ్రీకాంత్ తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రచార భేరిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విదానాలకు వ్యతిరేకంగా మతోన్మాద బిజెపిని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈనెల 14 నుంచి 30 వరకూ ప్రచారభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు యు. వెంకటేశ్వర్లు, జి. బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, ఎన్. రామారావు, రత్నపాల్, సంజీవరావు, కె శ్రీను పాల్గొన్నారు.



మార్కాపురంలో మాట్లాడుతున్న నాయకులు



దర్శిలో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

పశు బలప్రదర్శన పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో పశు బలప్రదర్శన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల ఆవరణలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు బలప్రదర్శన పోటీలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. పశు బలప్రదర్శన పోటీలను పట్టణంతో పాటు సమీప గ్రామాల్లోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్. అంజమ్మ శ్రీనివాస్, మాజీ జడ్‌పిటిసి జవ్వాజి వెంకటరంగారెడ్డి, సూరెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



విరాళం అందజేత మాజీ మంత్రి శిద్దా దంపతులు

రూ.2 లక్షల విరాళం అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శి పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం అభివృద్ధి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, పద్మావతి దంపతులు రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఒంగోలులోని తన నివాస గృహంలో ఆలయ కమిటీ సభ్యులకు శిద్దా దంపతులు శుక్రవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అచ్యుత కొండలు, మారం శివకోటిరెడ్డి, సభ్యులు దేవకి మహానంది, వెంకటేశ్వర్లు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

పెద్దదోర్నాల : పెద్దదోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూణేకు చెందిన అంతర్జాతీయ చేతిరాత ఒలంపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో చేతిరాత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన వి. కళ్యాణిబాయి (10వ తరగతి) బంగారు పతకాన్ని సాధించింది. పది మంది విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సామ్యూల్ జోబ్, వైస్ ప్రిన్సిపల్ లాలయ్య, డిప్యూటీ వార్డెన్ ఎం. సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

టంగుటూరు : విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలదుగు వివేకానంద కోరారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా తహశీల్దారు చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ అంబేద్కర్ సాక్షిగా విఆర్‌ఎలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ శాఖల సంఘం అధ్యక్షుడు పరికూటి శ్రీనివాసులు, సుందరరావు, ప్రభాకర్, ఈతముక్కల నరసింహం, పద్మ, రామసుబ్బులు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిటిసి అశ్వని

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని కూనంనేనివారి పాలెంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దాత బొడ్డపాటి చెంచారావు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కెవిపాలెం సిపిఎం ఎంపిటిసి వేమా అశ్విని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శులు బెజవాడ శ్రీను, పొత్తూరి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, దర్శి సుధాకర్, నల్లూరి కృష్ణయ్య, మాదాల నారాయణ,యర్రగుంట్ల వసంతరావు, పుట్టా శ్రీను, గోగినేని నరసింహారావు, డాక్టర్ పమిడి వెంకటేశ్వర్లు, వేమా చినకోటేశ్వర రావు, రావూరి వెంకటరావు,రాయపూడి కోటయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-వెలిగండ్ల

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తాను ఇచ్చిన మాట నిల బెట్టుకోవాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ తెలిపారు. వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ రెండో మహాసభ యక్కంటి రాధమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ డిమాండ్ల సాధనకు జూన్, జూలైలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు రాయల మాలకొండయ్య, జివిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటే బాలకష్ట, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ముక్కు మహాలక్ష్మమ్మ, తాతపూడి ప్రమీల, టి. నారాయణమ్మ, వెంకటలక్ష్మి, రెడ్డం తిరుపతమ్మ, అనిశెట్టి నారాయణమ్మ, జి.రమాదేవి, రూబీ, స్వప్న, దమ్ము పద్మావతి, పాపబత్తిన ఆదిలక్ష్మి, రాయల రమాదేవి, వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కారుసా సుబ్బరావమ్మ

అంబేద్కర్ చూపిన మార్గం అనుసరణీయం



హెచ్ఎంపాడులో నివాళులర్పిస్తున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్


దేశానికి అంబేద్కర్ చూపిన మార్గం అనుసరణీయమని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో. కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేషన్ ఇంజినీర్ మాల్యాద్రి, ఎసిపి వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీహరి, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ పిచ్చయ్య, రెవెన్యూ అధికారులు భాస్కర్, మధు, కార్పొరేటర్లు అంగిరేకుల గురవయ్య, గోపిరెడ్డి గోపాలరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో....

వైసిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి జంకె వెంకటరెడ్డి, జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, బీసీ సెల్ నాయకులు కటారి శంకర్, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు పసుమర్తి గోపి చంద్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కత్తిరించి అందరికి పంచిపెట్టారు.

బాలినేని నివాసంలో....

అంబేద్కర్ జయంతి సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కత్తిరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, వైసిపి నాయకులు నత్తల యానాదిరావు, మున్సిపల్ వర్కర్స్ నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు. **ఒంగోలు క్రైం :** అంబేద్కర్ స్ఫూర్తిలో సమసమాజ స్థాపన, దేశ ప్రగతికి అందరూ తమ వంతు కృషి చేయాలని ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. ఎస్‌పి కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి, పోలీసు అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైని ఐపిఎస్ అంకిత సురాన, ఎఎస్‌పిలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, అశోక్‌బాబు, డిఎస్‌పిలు మరియదాసు, వెంకటేశ్వర్లు, సిఐ దేవప్రభాకర్ పాల్గొన్నారు. **ఒంగోలు కలెక్టరేట్ :** జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బట్టు బాలాజీ రావు, ప్రధాన కార్యదర్శి బాలచంద్రం, సహాయ కార్యదర్శి కష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, మీడియా ఇన్‌ఛార్జి దాసరి సుధాకర్, ఉపాధ్యక్షులు ఎకె. రత్నాచారి, మాల కొండయ్య, ఒంగోలు పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలు ఆంటోనీ రాణి, కార్యదర్శి శాంతి, నాగమణి పాల్గొన్నారు **సంతనూలపాడు రూరల్ :** సంతనూతలపాడు సర్పంచి దర్శి నాగమణి, ఎంపిపి విజయ, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అంబేద్కర్‌కు నివాళులర్పించారు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, కెవిపిఎస్ మండల నాయకులు టి.ప్రభుదాసు ప్రజా సంఘాల నాయకులు అన్నవరపు శేషారావు, ఈదర సుబ్బారావు పి శ్రీమన్నారాయణ, సంపత్‌పాల్గొన్నారు . ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు బంకా పద్మ, నాయకులు నెరుసుల మాలతి,లత, జ్యోతి, సులోచన అంబేద్కర్‌కు నివాళులర్పించారు. మండల పరిధిలోని పేర్నమిట్టలో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.కె మాబు, మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు చినబాబు, రమణ, సుబ్బారావు, కోట్లింగం, కోటేశ్వరరావు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** ఉప్పుగుండూరులో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి. శ్రీకాంత్ యు వెంకటేశ్వర్లు, జి బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, ఎన్. రామారావు, రత్నపాల్ సంజీవరావు శ్రీను పాల్గొన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి విజయకుమార్ అంబేద్కర్ విగ్రహనికి నివాళులర్పించారు. **దర్శి :** అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, సిపిఐ నాయకులు తాండవ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, రమేష్, జూపల్లి కోటేశ్వరరావు నివాళులర్పించారు. నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ స్టీవెన్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తాళ్లూరు ఎస్‌సి కాలనీలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. **హనుమంతునిపాడు :** అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేస్తూ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కారయక్రమంలో మాజీ జడ్‌పిటిసి పాశం వెంకటేశ్వర్లు. మాజీ ఎంపిపి తాత పూడి బుజ్జి పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కంఉక నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జివి.కష్ణారావు ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. **దొనకొండ :** ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచి కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, ఎంపిడిఒ వి.వసంతరావునాయక్, ఎంఇఒ సాంబశివరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. **టంగుటూరు :** అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి నివాళులర్పించారు. వైసిపి కార్యాలయంలో వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య బొమ్మల సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. **పొన్నలూరు :** టిడిపి మండల అధ్యక్షుడు అనుమల సాంబశివరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** సిపిఎం కార్యదర్శులు డాక్టర్ టంగుటూరి సత్యనారాయణ, భూమని వెంకటేశం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వైసిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుంటి అశోక్, ఎస్ఐ కోటయ్య అంబేద్కర్‌కు నివాళు లర్పించారు. **త్రిపురాంతకం :** సిఐటియు కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైటి.ఆంజనేయులు, సిఐటియు మండల నాయకులు జి.రాజా రామయ్య, వై.పిచ్చయ్య, జ్యోతి, వై.



ఒంగోలులో నివాళులర్పిస్తున్న బాలినేని, బూచేపల్లి

రాంబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్ ఎనిబెర నాగభూషణం పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** పంచాయతీ కార్యాలయంలో సర్పంచి చిత్తూరి హారిక, ఇఒ మోహన్‌రావు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నటరాజ్ సెంటర్‌లో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, గుమ్మా యల్లేష్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసరావు, టిడిపి నాయకుడు భట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. **శింగరాయకొండ :** అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పూలమాల వేసి నివాళుర్పించారు. పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళు ర్పించారు. ఆయా కార్యక్రమంలో వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, శింగరాయకొండ తాటిపర్తి వనజ, అంబేద్కర్ కమిటీ



చీకుకుర్తిలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

సభ్యులు పులగూర కష్ణయ్య, అల్లు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, డాక్టర్ యన్నాబత్తిన కార్తీక్, షేక్ సలీం బాషా, రాపూరి ప్రభావతి , చొప్పర వెంకన్న పాల్గొన్నారు. **తర్లుపాడు :** తహశీల్దారు వరకుమార్, ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, కోప్షన్ అక్బర్‌వలి, నెహ్రు యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, ఎస్‌సి సెల్ సభ్యులు మురారి వెంకటేశ్వర్లు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. **పిసిపల్లి :** వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు గుంటగాని యాకోబు అధ్యక్షతన అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా రమేష్, నూకతోటి గోపి పాల్గొన్నారు. మారేళ్ళలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు జనార్ధన్, నేరేడుపల్లిలో స్వర్ణ రంగనాయకులు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. **మద్దిపాడు :** యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో అంబేద్కరు జయంతి నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మానస అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు కాకుమాను సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, అంజయ్య పాల్గొన్నారు. **కొత్తపట్నం :** మండల పురిధిలోని స్వర్ణాంధ్ర పట్టపు పాఠశాలలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జి. కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాకుమాని నీరజారత్నం పాల్గొన్నారు. **మార్కాపురం :** అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కోరారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మున్సిపల్




మార్కాపురంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. **కంభం రూరల్ :** సిఐటియు, యుటిఎఫ్, జెవివి, రైతు, ఆవాజ్, యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు తోట తిరుపతిరావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి సునీల్, అధ్యక్షుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు , సిఐటియు జిల్లా నాయకుడు దానం, రైతు సంఘం నాయకుడు పి.దాసరి రెడ్డి, యువజన సంఘం నాయకుడు వెంకట్ ఆవాజ్ జిల్లా కార్యదర్శి షంషేర్ బేగ్, యుటిఎఫ్ నాయకుడు, పిచ్చిరెడ్డి, రసూల్ బేగ్, కోశాధికారి, రాజా కష్ణ, వరప్రసాద్, జెవివి డివిజన్ అధ్యక్షుడు రంగరాజు పాల్గొన్నారు. **కొమరోలు :** తహశీల్దారు రమాదేవి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. **గిద్దలూరు :** మండలపురిధిలోని ఉయ్యాల వాడలో వైసిపి నాయకులు దాసరి సురేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి ప్రసాద్, ఉడుముల సుధాకర్, దాసరి దాస్ పాల్గొన్నారు. **మర్రిపూడి :** ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకుడు బసవయ్య, ఎంఇఎఫ్ నాయకులు కిషోర్ కుమార్, కిరణ్, ఇజ్రాయిల్, లోకయ్య పాల్గొన్నారు. **చీమకుర్తి :** పోలీసు స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్‌పికాలనీ పాఠశాలలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరి నారాయణ అంబేద్కర్‌కు నివాళు లర్పించారు. యుటిఎప్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షుడు అక్బర్,ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు చల్లాశ్రీను, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాదు, శిలార్, దాసరి సుబ్బారావు పాల్గొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పూసపాటి వెంకటరావు, శ్రీను, ఆంజనేయరెడ్డి, నాగయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి తొట్టెంపూడి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు వేమా వెంకటరావు, డివైఎఫ్ఐ నాయకులు పిల్లి విజయ్,కె. ఆదెయ్య, ఆర్.తిరుపతయ్య, దర్శి సుధాకర్, నారాయణ పాల్గొన్నారు. **కనిగిరి :** మండల పరిధిలోని ఏరువారిపల్లిలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకుడు పివి. శేషయ్య, ఏరువారిపల్లి గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య అంబేద్కర్ చిత్రపటానకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ నాగిరెడ్డి, రామ్మోహన్, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని పాతపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులపాల్గొన్నారు.



దర్శిలో నివాళులర్పిస్తున్న నాయకులు



టంగుటూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టిజెఆర్, బూచేపల్లి



పొదిలిలో నివాళులర్పిస్తున్న నాయకులు

బిఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇంకొల్లులో జై భీమ్ జై తెలుగుదేశం భారీ బహిరంగ సభ నిర్వహించారు. భారీ బహిరంగ సభలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, కొండపి శాసనసభ్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ ఎంఎం కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దళితులు, గిరిజనులు, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న దాడులు హత్యలను నిరసిస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి, చైతన్యం నింపేందుకు ఈ బహిరంగ సభ నిర్వహించామని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు వివరించారు. తొలుత ఇంకొల్లు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. డప్పు వాయిద్యాలతో యువత ముందుకు కదిలారు.





సభలో మాట్లాడుతున్న తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టి కృష్ణమోహన్

చీరాల: భారతదేశ దిక్సూచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని బీసీ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూరగాని లక్ష్మి అన్నారు. శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా బీసీ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, నరసింహారావు దంపతుల ఆధ్వర్యంలో స్థానిక ముక్కోన పార్క్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌విఎన్ మల్లేశ్వరావు, ధనుంజయ, సూరగాని పిచ్చయ్య, భాస్కర్, నారాయణ, అసిరి నాయుడు, సూరగాని హనుమంతురావు, వసంతరావు, గుడిపల్లి వెంకట్రావు, శ్రీకాంత్, తులసి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు, కొరిశపాడు, సోమవరప్పాడు, ఎర్రబాలెం గ్రామాలలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. మేదరమెట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండల అభివృద్ధి అధికారి డి సురేష్‌బాబు, గ్రామ సర్పంచ్ బొనిగల ఎలిసెమ్మ, దళిత యోజన వెల్ఫేర్ సంఘం సభ్యులు ఘనంగా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఎర్రబాలెంలో నూతన విగ్రహ ప్రతిష్ట మాజీ ఎమ్మెల్సీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ చేతుల మీదగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబాలెం అంబేద్కర్ యూత్ పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమం మేదరమెట్లలో శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు యుటిఎఫ్ నాయకులు పి హరిబాబు, సిఐటియు నాయకులు ఎం వీరాంజనేయులు, వై రవీంద్ర, ఎం పెద్దసుబ్బారావు, డి మాణిక్యరావు, జిల్లా ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులు సర్దార్ ఖాన్ కెవిపిఎస్ బాధ్యులు కంచర్ల సురేష్‌బాబు, వైకుంఠం, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా నగరంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగమణి, చందోలు దేవదాసు, గ్రామ సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు(కొల్లూరు): కొల్లూరు మండలం తోకలవానిపాలెం, తురకాపాలెం గ్రామాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఆ గ్రామ సర్పంచ్, సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత బాంధవుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాకిరణం డాక్టర్ అంబేద్కరని కృష్ణమోహన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే–బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ జ్ఞానాన్ని చూసి అనేక అంతర్జాతీయ యూని వర్సిటీలు డాక్టరేట్లు ఇచ్చాయన్నారు. మనుషుల్ని మనుషులుగా చూడని మనుధర్మశాస్త్రాన్ని రద్దుచేసి అందరినీ సమానంగా చూసే భారత రాజ్యాంగాన్ని అందించారు. సమాజంలో సగభాగం అయిన స్త్రీల కోసం, వారి హక్కుల కోసం పోరాడిన మానవతావాది అంబేద్కరని కొనియాడారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతి ప్రదానం చేశారు.

సంతమాగులూరు: భారత నవనిర్మాణానికి, కుల రహిత సమాజానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి చేశారని ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశం హాల్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు అశోకవర్ధన్, ఎంపీడీవో సాంబశివరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురుయాదవ్, ఎంపిటీసీ సభ్యులు మోదేపల్లి శ్రీనివాసరావు, నాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి, దుద్దేల గాలెయ్య, ఆలూరి శ్రీనివాసరావు, గుంజి లక్ష్మయ్య, విప్పల ముసలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృతలూరు: అమృతలూరు మండలం, కూచిపూడిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు బి అగస్టీన్ మాట్లాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చావలి రమేష్, కూచిపూడి భీమయ్య గాజులవర్తి సత్యనారాయణ, మాట్లపూడి ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి

జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబట్టుకుని తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరుతూ అద్దంకి పట్టణంలోని బంగ్లారోడ్డులో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ సహాయకు (విఆర్‌ఏ)లు నిరసన చేశారు. వీరి ఆందోళనకు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో విఆర్‌ఏలకు ఇచ్చిన హామీ మేరకు 21 వేలు రూపాయల జీతం ఇవ్వాలని కోరారు. మాటతప్పం మడమతిప్పం అంటూ అన్ని వర్గాల ప్రజలకు అమలుకాని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారాన్ని చేపట్టి నేడు అందరినీ మోసం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ గడిచిన తెలుగుదేశంపార్టీ హయాం లో విఆర్‌ఏల జీతం 6,500 నుంచి 10,500 లకు అనగా 4వేల రూపాయలు పెంచి నట్లు తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని గ్రామ సహాయకులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన డీప (భోజన అలవెన్సు) రికవరీ చేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. రికవరీ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం అనుక్షణం కష్టపడే విఆర్‌ఏలకు తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా కూడా తెలుగు దేశం ప్రభుత్వం 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ అమలు చేసి ఉద్యోగుల జీతాలు తగ్గించిందని దుయ్యబట్టారు. రివర్స్ పీఆర్సీ ద్వారా దాదాపుగా కోటిన్నర విఆర్‌ఏల జీతాలు వెనక్కి తీసుకోవడం ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. విఆర్‌ఏలు చేపట్టిన నిరసన దీక్షకు తెలుగుదేశం పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తు న్నాం. అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయ పరమైన డిమాండ్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. విఆర్‌ఏల న్యాయపరమైన డిమాండ్లను, సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



విఆర్‌ఏలకు ఎమ్మెల్యే గొట్టిపాటి సంఘీభావం

పార్టీ గెలుపు కోసం పని చేద్దాం: ఆమంచి

ప్రజాశక్తి-పర్చూరు

విభేదాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. పర్చూరు అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన కొనసాగుతుందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్చూరులో ఆమంచి గెలవాలనే పట్టుదలతో ఉన్నారన్నారు. 175 నియోజకవర్గాల మీద పూర్తిగా పట్టు ఉందని, అందుకనే వైనాట్ 175 అంటున్నారని వివరించారు. సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యపడుతుందని బీద మస్తాన్‌రావు అన్నారు. పెద్దల సభకు ఏ రాజకీయ పార్టీ బీసీలను పంపలేదన్నారు. రాజ్యసభలో 9 స్థానాల్లో 4 స్థానాలను బిసిలకు కేటాయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. కుల, మత ప్రాంతీయ భేదాలు లేకుండా పాలన సాగుతోందని అన్నారు. సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకొని టిడిపి వర్గీయులకు వత్తాసు పలకటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చుండూరి రవి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ చుండు సుజ్ఞానమ్మ, మండల కన్వీనర్ కఠారి అప్పారావు, తోకల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్

నాగులపాలెంలో కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలంలోని నాగులపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి హాజరయ్యారు.



దుద్దుకూరులో ఇంటర్మీడియట్‌కు దత్తత తీసుకున్న విద్యార్థులు

బాలికా విద్యను ప్రోత్సహించటమే లక్ష్యం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

బాలికలు ఉన్నత చదువులు చదివితే ఆ కుటుంబాలకు, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పూనాటి రవీంద్ర సతీమణి సరోజిని సూచించారు. ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టైమ్స్) సంస్థ పక్షాన గత సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన ముగ్గురు బాలికలను గుంటూరు చైతన్య బాలికల కళాశాలలో ఉచితంగా చదివిస్తున్నామన్నారు. సమావేశానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివాసాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసిన పిల్లలను కూడా దత్తత తీసుకోవాలని సైన్స్ ఉపాధ్యాయుడు యు చెంచయ్య కోరారు.

సిపిఎం సానుభూతిపరుడు నన్నేఖాన్ భార్య మృతి

ప్రజాశక్తి-పంగులూరు



సిపిఎం సానుభూతిపరుడు పఠాన్ నన్నే ఖాన్ భార్య, పఠాన్ మొగలాబి గురువారం సాయంత్రం పంగులూరులోని ఆమె స్వగృహంలో మరణించారు. గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఆమె, గత ఆరు నెలల నుంచి అనారోగ్యంగా ఉన్నారు. రక్తహీనతతో తీవ్రంగా నీరసించిన ఆమె గురువారం సాయంత్రం మరణించారు. ఆమె భర్త నన్నే ఖాన్ పంగులూరులో సిపిఎం ప్రారంభ రోజుల్లో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. తరువాత సిపిఎం సానుభూతిపరుడుగా ఉంటూ వచ్చారు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు, కాగా వారికి వివాహాలు అయినాయి. మరణించిన మొగలాబి మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు, పార్టీ జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, తలపనేని రామారావు, తలపనేని సుబ్బారావు, పి ఏలియా, వైసీపీ నాయకులు బాచిన రామారావు, బాచిన నాగార్జున, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అద్దంకి

సిఐటియు అద్దంకి మండలం మహాసభ శుక్రవారం అద్దంకిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ మహాసభలో అధ్యక్షులుగా జి శారద, కార్యదర్శిగా జి వెంకట్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, మునిసిపాలిటీ, మిడ్డే మీల్, ఫ్రూట్ వెండర్స్, వివిధ సంఘాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు మజుందార్, జిల్లా నాయకులు ఎంసి హెచ్ వీరాంజనేయులు, బాపట్ల జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



సిఐటియు మండల కార్యదర్శిగా జి వెంకట్రావు

'నరేంద్ర మోడీ హటావో' నినాదంతో

బాపట్లలో ప్రచారభేరి ప్రారంభం



ప్రచార భేరి కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

దేశవ్యాప్తంగా కేంద్రంలో 'నరేంద్ర మోడీ హటావో' నినాదంతో చేపట్టిన ప్రచార భేరిని శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు బాపట్లలో ప్రారం భించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సిపిఎం సీనియర్ నాయకులు నూతనపాటి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్య, సిపిఐ సీనియర్ నాయకులు జల్లి భాగ్య శ్రీధర్, సిపిఐ జిల్లా నాయకులు ముత్తిరెడ్డి శ్రీనివాస్ నాగేశ్వరరావు, మామిడి బత్తుల అశోక్ పాల్గొన్నారు.

ఆశయాల కొనసాగింపే నిజమైన నివాళి

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని, బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక వేమా యల్లయ్య భవనం ప్రాంగణంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభకు స్థానిక ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు అధ్యక్షత వహించారు. బాలినేని మాట్లాడుతూ వేమాశ్రీనివాసరావు ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య మార్గంలో నడుస్తూ ప్రజాసేవ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడారు. ముందుగా స్థానిక పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన మాజీ ఎంపిపి పిహెచ్‌సి స్థల దాత సుంకరమస్తాన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని, జనరేటర్‌ను బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్టు పిహెచ్‌సి ముఖద్వారం, వేమా యల్లయ్య ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని, మున్సిపల్ ఓపెన్ జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చల్లా అంకులు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కె.శేఖరరెడ్డి, వైసిపి నాయకులు చిన్నపురెడ్డి మస్తానరెడ్డి, జి.ఓబులరెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, జ్యేష్ట శ్రీను, బాపతు వెంకటరెడ్డి, మంచా హరికృష్ణ, పి గంగయ్య, ఎస్‌కె బాషా, పేరం శ్రీను పాల్గొన్నారు.


ఐజికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి మలికగర్గ్

ఐజిని కలిసిన ఎస్‌పిలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గుంటూరు రేంజ్ ఐజిగా జి.పాలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రకాశం, బాపట్ల ఎస్‌పిలు మలికగర్గ్, వకుల్‌జిందాల్ ఐజికి పుష్పగుచ్ఛం అందజేసి..శుభాకాంక్షలు తెలిపారు.


నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంబేద్కర్ జయంతిని కెవిపిఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఏడుకొండలు, న్యాయవాది, ఐలు జిల్లా నాయకులు డి.యల్ రాజు, చంద్రయ్యనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అట్లూరి రాఘవులు, జిల్లా కార్యదర్శి రఘురామ్ పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఐద్వా జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమ్మి, నగర అధ్యక్షురాలు బి. గోవిందమ్మ, జిల్లా నాయకులు కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

బాపట్ల కలెక్టర్‌గా

రంజిత్‌బాషా బాధ్యతల స్వీకరణ


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల నూతన కలెక్టర్‌గా పి.రంజిత్ బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రంజిత్ బాషా బదిలీపై బాపట్ల కలెక్టర్‌గా వచ్చారు. రంజిత్ బాషా స్వస్థలం కర్నూలు జిల్లా నందికొట్కూరు. 2013లో గ్రూప్-1 అధికారిగా ఎన్నికయ్యారు. కడప ఆర్‌డివోగా, తరువాత సిసిఎల్‌ఏ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. తరువాత గుడివాడ ఆర్‌డివోగా, పంచాయితీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2018లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తూ గతేడాది నూతన జిల్లాల ఏర్పాటుతో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఏడాది కాలం తరువాత సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజిత్ బాషాకు జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివజ్యోతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశు సంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు రవీంద్ర, సరోజిని, పార్థసారథి, తహశీల్దార్లు శుభాకాంక్షలు తెలిపారు.

అంబేద్కర్ స్ఫూర్తితో

జిల్లా అభివృద్ధికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సామాజిక వివక్షపై జీవితాంతం పోరాడిన భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాలలో అభివద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక హెచ్‌సిఎం కళాశాల సెంటర్, ప్రకాశం భవనం సమీపంలో ఉన్న ఆయన విగ్రహాలకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఏఎస్‌సి నాగేశ్వరరావులతో కలసి కలెక్టర్ పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. బాలినేని మాట్లాడుతూ ఒంగోలులో అంబేద్కర్ ఆడిటోరియం కోసం ఇప్పటికే స్థలం కేటాయించటంతో నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు.

అనంతరం అంబేద్కర్ భవన్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్.సి., ఎస్.టి. వర్గాలవారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను దళిత సంఘాల నాయకులు ప్రస్తావించారు. జెసి మాట్లాడుతూ దళిత సంఘాల విజ్ఞప్తులు, సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. చనిపోయాక తమ మతదేహాలను వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ఒంగోలు రిమ్స్ ఇస్తామంటూ ముందుకు వచ్చిన పలువురు దళిత నాయకులకు ఈ సందర్భంగా "సుముఖత పత్రాలను" జెసి అందించారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు వీల్‌ఛైర్లు అందజేత


వీల్‌ఛైర్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎంఎన్‌ఒలు, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సహకారంతో రోగుల సౌకర్యార్థం జిజిహెచ్‌కు రెండు వీల్ ఛైర్లను హాస్పిటల్ అధికారులకు శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ సర్వజన హాస్పిటల్‌లో శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ జి.బాలాజీనాయక్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ బి.సంపూర్ణమ్మ, సిఎస్ ఆర్‌ఎంఒ చైతన్యవర్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి.. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ జాన్‌రిచర్డ్స్, నర్సింగ్ యూనియన్ సభ్యులు కె.మంజేష్, రమణనాయక్, మహేష్, విజయ్ పాల్గొన్నారు.

కృష్ణానది తీరంలో ముసలి మృతి


మృతిచెందిన ముసలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల పరిధిలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల నెక్కంటి రేంజీ గుట్టలచేను బీట్ పరిధిలో ఉన్న పెద్దరేవు ప్రాంతంలో కృష్ణానది తీరంలో ముసలి చనిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖాధికారులు నది తీరానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా నదిలో అక్రమంగా చేపలు పట్టే వారి వలలో చిక్కుకొని మరణించి ఉండొచ్చని అటవీ శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ముసలి అనారోగ్యంతో చనిపోయిందా.? చేపలు పట్టే వారి వలలో చిక్కుకొని చనిపోయిందా.? అనేది విచారణలో తెలియాల్సి ఉంది.ఈ విషయమై గంజివారిపల్లి అటవీ రేంజ్ అధికారి సుబ్బారావును వివరణ కోరగా ముసలి రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలా చనిపోయిందనే కోణంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి చేపల వేట నిషేధం

ఈ నెల15 నుంచి జూన్ 14 వరకు అమలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి ఏడాదీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నారు. లోతైన సముద్రజలాల్లో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లు, నాన్ మోటరైజ్డ్ బోట్లతో సాగించే చేపలవేటకు తాత్కాలికంగా విరామం ప్రకటిస్తారు. ఈ సమయం సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే కాలం కావడంతో చేపల గుడ్లు పునరుత్పత్తి జరిగే సంధికాలంగా పేర్కొంటూ సముద్రంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్యలను సంరక్షించడం.. వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్రంలో మత్స్య సంపద పెంపొందించేందుకు ఏటా ఈ పద్ధతిని రాష్ట ప్రభుత్వం అమలుచేస్తుంది. సముద్రంలో వేట సాగని ఈ రెండు నెలల కాలం మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక చేయూత కోసం రూ.10 వేలు చొప్పున వేట నిషేధకాల భృతిని ఇస్తున్నారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 65 మత్స్యకార గ్రామాల్లో 54 వేల మంది మత్స్యకారులున్నారు. జిల్లాలో అన్ని రకాల బోట్లు కలిపి 2,986 వరకు ఉన్నాయి. శనివారం నుంచి 61 రోజుల పాటు సముద్రంలో వేట నిలిచి పోవడంతో మత్స్యకారులు తమ జీవనాధారాన్ని కోల్పోతారు. ఈ కాలంలో బోట్లు, వలల మరమ్మతులు చేసుకుంటారు. కొందరు బోటు యజమానులు ఇచ్చే సాయంతో జీవనం గడుపుతారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. గతేడాది జిల్లాలో 9,666 మంది వత్స్యకారులకు ఆర్థిక సాయం అందించారు. మత్స్యకారుల్లో అర్హులైన పలువురికి ప్రభుత్వ సాయం అందలేదని గతేడాది మత్స్యకారులు ఆరోపించారు. ఈ సారైనా సక్రమంగా పరిశీలన చేసి అర్హులైన వారందరికీ మత్యకార భరోసా అందేలా చూడాలని కోరుతున్నారు.


సముద్రపు ఒడ్డుకు చేర్చిన పడవలు

చేపల వేటకు వెళితే చర్యలు

జిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్



సముద్రంపై వేట నిషేద సమయంలో ఎవరైనా చేపల వేటకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి జూన్ 14 వతేది వరకు సముద్రంలో వేటను నిషేధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా పరిధిలోని సముద్రంలో తీరప్రాంత మత్స్యకారులు ఎవరూ చేపల వేట చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వేటకు వెళ్ళిన వారిపై ఏపీ ఎంఎస్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామన్నారు.